ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ

☛ ఇద్దరు దుర్మరణం, ఏడుగురికి గాయాలు

లక్ష్మమ్మ, వెంకట ఆంజనేయులు (పాత చిత్రాలు)

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: వారంతా దినసరి కూలీలు.. పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.. సూర్యోదయం కంటే ముందుగా నాపరాళ్ల గనుల్లోకి కూలి పనుల కోసం ట్రాక్టర్‌లో వెళ్తుండగా లారీ రూపంలో ప్రమాదం వెంటాడింది. కడప- తాడిపత్రి జాతీయ రహదారిలోని ఎర్రగుంట్ల మండల పరిధిలోని చిలమకూరు వద్ద గురువారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, ఏడుగురు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. చిలమకూరు గ్రామానికి చెందిన తొమ్మిది మంది కూలీలు గురువారం తెల్లవారుజామున నిడిజివ్వి నాపరాళ్ల గనిలోకి పనికి వెళ్తుండగా వెనుక వైపు నుంచి లారీ ఢీకొంది. ఘటనలో ముత్తరాసు లక్ష్మమ్మ (55), నత్తి గంగులు గారి వెంకటఆంజనేయులు (55)లు మృతి చెందారు. గాయపడిన పొన్నా వెంకటసుబ్బయ్య, గంగాదంపల్లి హరినాథ్, ఎట్టి చిన్న ఓబన్న, కొండగంగన్న గారి ఓబయ్య, మాలెపాటి బాలస్వామి, మల్లేల రోశయ్య, పోలుగారి గురప్పలు ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేష్ బాబు వివరించారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు మృతి చెందగా, ఏడుగురు గాయపడడంతో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆ గ్రామాల్లో నవోదయమే లక్ష్యం

సారా రహిత జిల్లాగా మారుస్తాం ☛ సహాయ ఎక్సైజ్ పర్యవేక్షణాధికారి వినోద్‌కుమార్

న్యూస్‌టుడే, కడప నేరవార్తలు

నాటుసారా ప్రభావిత ప్రాంతంలోని ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

'రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా వైఎస్ఆర్ జిల్లాను రానున్న ఏడుమాసాల్లో సారారహిత జిల్లాగా మార్చేందుకు కంకణం కట్టుకున్నాం. జిల్లాలోని ప్రతి ఒక్క ఎక్సైజ్ ఉద్యోగి ఇందులో పాలుపంచుకుంటున్నారు' అని జిల్లా సహాయ ఎక్సైజ్ పర్యవేక్షణాధికారి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లాలో నవోదయం కార్యక్రమం అమలు తీరుపై 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...

పది ప్రాంతాల గుర్తింపు

వైఎస్ఆర్ జిల్లాలో 10 నాటుసారా ప్రభావిత ప్రాంతాలున్నాయి. సీకే దిన్నె మండలంలో గుర్రంగుంపుతండా, మద్దిమడుగుతండా, చక్రాయపేట మండలంలో కల్లూరిపల్లె తండా, కుప్పం తండా, పులివెందులలో నగరిగుట్ట, లింగాలలో అంబకపల్లె, వేంపల్లెలో రామిరెడ్డిపల్లె, మైదుకూరులో గంజికుంటతండా, ముదిరెడ్డిపల్లె తండా, బి.మఠంలో గోపిరెడ్డిపల్లె అందులో ఉన్నాయి. వీటిలో కల్లూరిపల్లెతండాలో(ఎ-విభాగం) అక్కడే సారా తయారు చేసి ఇతర జిల్లాలకు విక్రయిస్తారు. రామిరెడ్డిపల్లె (సి-విభాగం) కేవలం నాటుసారా పంపిణీ మాత్రమే ఉంటుంది. మిగిలిన గ్రామాల్లో (బీ-విభాగం) తక్కువ స్థాయిలో తయారుచేస్తారు. ఈ పది ప్రాంతాల్లో 36 మంది తయారు చేసి, విక్రయించేవారున్నారు.

ఏడు మాసాల్లో...

ఏడుమాసాల్లో అయిదు విడతల్లో నవోదయం కార్యక్రమం ఉంటుంది. మొదటి విడతలో గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు, రెండో విడతలో ఎన్‌ఫోర్స్‌మెంటు దాడులు, మూడో విడతలో గ్రామసభలు నిర్వహించి రుణాలిప్పించి వారికి వేరే ఉపాధి చూపిస్తాం. నాలుగో విడతలో నాటుసారారహిత గ్రామంగా ప్రకటిస్తాం. అయిదో విడతలో ఇంటింటికి వెళ్లి కౌన్సెలింగ్ ఇస్తాం. ఒక వేళల్లో వారిలో మార్పు రాకుంటే బైండోవర్ కేసులు నమోదు చేసి పీడీయాక్టులు నమోదు చేస్తాం. నాటుసారా అమ్మినా, తయారు చేసినా, రవాణా చేసినా ఎనిమిదేళ్లు జైలు శిక్షతో పాటు రూ.5 లక్షల జరిమానా విధిస్తాం.

పట్ట పగలే చోరీ

రూ. 14 లక్షల విలువైన బంగారు నగలు, నగదు అపహరణ

బద్వేలు, గోపవరం, న్యూస్‌టుడే: బద్వేలు పురపాలక పరిధిలోని మడకలవారిపల్లెలో గురువారం పట్టపగలే తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. ఘటనలో 17 తులాల బంగారు నగలు, రూ.4 లక్షల నగదు అపహరించారు. పోలీసులు, బాధితుల కథనం మేరకు.. ఇంటి యజమాని శ్రీనివాసులు వ్యవసాయ పొలానికి నీటి తడలను అందించేందుకు వెళ్లారు. భార్య శివకుమారి, కుమారుడు సుబ్రహ్మణ్యం, కోడలు శివదీపికతో కలిసి బద్వేలు లోని ఓ ప్రైవేటు వైద్యశాలకు వెళ్లారు. అక్కడ వైద్యం చేయించుకుని ఇంటికి రాగా ఇంటి తాళం పగలగొట్టి తెరిచి ఉంది. బీరువాలో భద్రపరిచిన 17 తులాల బంగారు నగలు, రూ.4 లక్షలు నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కడప నుంచి క్లూస్ టీమ్ రప్పించి వేలిముద్రలను సేకరించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భార్యపై గొడ్డలితో దాడి

చాపాడు, న్యూస్‌టుడే: భార్యపై భర్త గొడ్డలితో దాడి చేసిన ఘటన మండల పరిధిలోని నక్కలదిన్నెలో గురువారం చోటుచేసుకుంది. ట్రైనీ డీఎస్పీ భవాని కథనం మేరకు.. గ్రామానికి చెందిన కళావతి గురువారం మధ్యాహ్నం కళావతి కూలి పనికి వెళ్లి ఇంటికి వచ్చారు. తన తెలియకుండా ఎక్కడికెళ్లావని ఆమె భర్త భాస్కర్ ప్రశ్నించాడు. ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో కళావతిపై భర్త కత్తితో దాడి చేశాడు. బాధితురాలి కేకలు విన్న చుట్టుపక్కల వారు వచ్చి చూసేసరికి భర్త కత్తితో పరారయ్యాడు. చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. భార్యపై భాస్కర్ అనుమానం పెంచుకుని తరచూ వేధించేవాడని ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

పంటను దెబ్బతీసిన సిమెంటు పరిశ్రమ కాలుష్యం

☛ అప్పుల బాధతో మిర్చి రైతు బలవన్మరణం

మైలవరం, న్యూస్‌టుడే: అప్పుల బాధతో మిర్చిరైతు బలవన్మరణానికి పాల్పడిన ఘటన మైలవరం మండలంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. దుగ్గనపల్లె గ్రామానికి చెందిన రైతు **చీపాటి మోషే (52)** తన కున్న 6.40 ఎకరాల్లో మిరప సాగుచేశాడు. గ్రామ సమీపంలో ఓ సిమెంటు పరిశ్రమ ప్రభావంతో దుమ్ము, ధూళి పైరుపై పడి సరిగా దిగుబడి రాలేదు. నాలుగు రోజుల కిందట గుంటూరు మార్కెట్ యార్డుకు మిర్చిని తరలించగా తక్కువ ధరకు అడగడంతో అక్కడే గోదాములో ఉంచాడు. పంట సాగుకు దాదాపు రూ.12 లక్షలు అప్పు చేశాడు. దీంతోపాటు గత మూడేళ్లుగా పంటలు సరిగా పండక రూ.25 లక్షలకు పైగా అప్పులయ్యాయి. ఈ క్రమంలో గురువారం ఉదయం మనస్తాపానికి గురై తన పొలంలోనే పురుగుల మందు తాగాడు. ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

పోలీసుశాఖకు మంచి పేరు తేవాలి

ఎస్పీ అశోక్‌కుమార్‌ను కలిసిన ప్రొబేషనరీ ఎస్సైలు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: ప్రొబేషనరీ కాలంలో జిల్లా పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా పోలీసు అధికారి అశోక్‌కుమార్ అన్నారు. ఇటీవల ఎస్సైలుగా శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో శివనాగిరెడ్డి, జగదీశ్వరరెడ్డి, అనిల్‌కుమార్, ప్రణయ్‌కుమార్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, నాగకీర్తన, సుబహాన్‌లను ప్రొబేషనరీ ఎస్సైలుగా జిల్లాకు కేటాయించారు. ఈ మేరకు వారు గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలిచ్చారు. ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా అంకితభావంతో, క్రమశిక్షణ, నిజాయతీ, పారదర్శకంగా విధులు నిర్వహించాలన్నారు. సాంకేతికతను వినియోగించుకుని, ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు.

లక్ష్యసాధనకు కృషి చేయండి

విద్యార్థులకు ఆయుధాలపై వివరిస్తున్న పోలీసులు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని జిల్లా పోలీసు అధికారి అశోక్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కడప పోలీసు మైదానంలో ఏర్పాటు చేసిన ఓపెన్‌హౌస్‌ను ఎస్పీ విద్యార్థులతో కలిసి ప్రారంభించారు. వివిధ రకాల ఆయుధాలపై ఏఆర్ పోలీసులు విద్యార్థులకు తెలియజేశారు. ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి ఓ లక్ష్యాన్ని ఎంచుకుని ఆ దిశలో ముందుకు వెళ్లాలన్నారు. ఏఎస్పీ ప్రకాష్‌బాబు, ఏఆర్ ఏఎస్పీ రమణయ్య తదితరులున్నారు.

8, 9 తేదీల్లో అభ్యంతరాల స్వీకరణ

కడప విద్య, న్యూస్‌టుడే : సీనియారిటీ జాబితాకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే కడప నగరంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో మార్చి 8వ తేదీ (రెండో శనివారం), 9వ తేదీ (ఆదివారం) సెలవు దినాలైనా యథావిధిగా మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 7 గంటల వరకూ ఉపాధ్యాయుల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు డీఈవో షంషుద్దీన్ ప్రకటనలో పేర్కొన్నారు.

నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదన వ్యతిరేకించాలి

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: జనాభాప్రతిపదిక చేసే లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదనను తక్షణమే వ్యతిరేకించాలని శాసనమండలి సభ్యుడు సి. రామచంద్రయ్య గురువారం పేర్కొన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తీసుకున్న నిర్ణయం ఆహ్వానించదగ్గదన్నారు. భిన్నమైన సిద్ధాంతాలు, విధానాలు కలిగినప్పటికీ తమ రాష్ట్రప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఎన్డీఏ పార్టీలు సైతం అక్కడ ఆ తీర్మానాన్ని బలపరచడం గమనార్హమన్నారు. ఇదే వైఖరిని ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని పార్టీలు మన ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అనుసరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. లేకపోతే రాష్ట్రం తీవ్రంగా నష్టపోతుందన్నారు. 2026లో జనాభా లెక్కలు చేపట్టి ఆప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేయడం దక్షిణాది రాష్ట్రాలకు గొడ్డలిపెట్టన్నారు. దీనిపై ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు స్పందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ఆర్టీపీపీలో ఒప్పంద కార్మికుడు మృతి

☛ న్యాయం చేయాలని బంధువుల ధర్నా

ప్రాజెక్టు ఆసుపత్రి వద్ద ధర్నా మృతదేహంతో ధర్నాచేస్తున్న బంధువులు, కార్మికులు

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ తాప విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం (ఆర్టీపీపీ)లో విధులు నిర్వర్తిస్తున్న ఒప్పంద ఉద్యోగి ఎస్‌జీ నాగరాజు(48) ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందాడు. వివరాలు.. అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన నాగరాజు 2011 నుంచి కోల్‌ప్లాంట్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ క్రమంలో ఆర్టీపీపీలో విధులు నిర్వర్తిస్తూ అపస్మారక స్థితిలో కుప్పకూలి కిందపడ్డాడు. వెంటనే ఆర్టీపీపీ ప్రాజెక్టు ఆసుపత్రికి తరలించగా నాగరాజు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అతని కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని బంధువులు, కార్మికులు మృతదేహంతో ప్రాజెక్టు ఆసుపత్రి వద్ద ధర్నా నిర్వహించారు.

రామయ్య క్షేత్రానికి పూర్వవైభవం తీసుకొస్తాం

రామతీర్థం, మండపం అభివృద్ధిపై చర్చిస్తున్న బృంద సభ్యులు, తితిదే ఇంజినీర్లు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట కోదండ రామాలయానికి పూర్వ వైభవం తీసుకొస్తామని, ఇందుకోసం బృహత్తర ప్రణాళిక రూపకల్పనపై కసరత్తు చేస్తున్నామని తితిదే సలహాదారు వి.రాముడు తెలిపారు. కార్య నిర్వహణాధికారి జె.శ్యామలరావు, సంయుక్త కార్యనిర్వహణాధికారి వి.వీరబ్రహ్మం ఆదేశాల మేరకు విజయవాడకు చెందిన నిపుణుల బృంద సభ్యులు గురువారం ఒంటిమిట్టలో పర్యటించారు. డైరెక్టర్ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ డాక్టరు ఎస్.రమేష్, నిపుణులు డాక్టర్ సి.అనిల్‌కుమార్, దీపక్‌కుమార్‌లు రామ, లక్ష్మణ తీర్థాలు, మండపం, రామాలయం, మాడ వీధులు, పరిసర ప్రాంతాలు, సీతారాముల కల్యాణ వేదికను పరిశీలించారు. భక్తులను ఆకట్టుకునేలా ఇక్కడ వసతుల కల్పనపై దృష్టి సారించినట్లు రాముడు తెలిపారు. భావి తరాలను దృష్టిలో పెట్టుకొని అధునాతన ఆకృతులపై అధ్యయనం చేస్తున్నామని చెప్పారు. రాములోరి సన్నిధి కేంద్ర పురావస్తుశాఖ పర్యవేక్షణలో ఉండటంతో కొన్ని అభివృద్ధి పనులకు అనుమతులు రావడంలో జాప్యం జరుగుతుందని డీఈ నాగరాజు, ఏఈ అమరనాథ్‌రెడ్డి, అర్చకుడు శ్రావణ్‌కుమార్ వివరించారు. ఆలయం, పరిసర ప్రాంతాల్లో అత్యవసరమైన పనులు ఏం చేయాలో గుర్తించి నివేదికను సిద్ధం చేస్తామని, దిల్లీ నుంచి అనుమతులు వచ్చేలా గట్టిగా కృషి చేస్తామని చెప్పారు. వచ్చే నెల 11న సీతారాముల కల్యాణోత్సవం రోజు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రానున్నారని చెప్పారు.

తలనీలాల ద్వారా రూ.66 లక్షల ఆదాయం

చక్రాయపేట, న్యూస్‌టుడే : గండిక్షేత్రంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో తలనీలాలు పోగుకు గురువారం వేలం నిర్వహించారు. వేలం ద్వారా రూ. 66 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. తెలంగాణలోని సికింద్రాబాద్‌కు చెందిన మదర్ హ్యూమన్ హెయిర్ ఎంటర్‌ప్రైజెస్ అధినేత ఆదినారాయణ రూ.66 లక్షలకు వేలం దక్కించుకున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఛైర్మన్ వెంకటస్వామి, ఆలయ ప్రధాన అర్చకులు కేసరి, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ప్రమాదంలో కాళ్లు కోల్పోయిన దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు అమర్చేందుకు కలెక్టరేట్‌లో కొలతలు తీసుకుంటున్నారు. వికలాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏడీ కృష్ణకిశోర్ పర్యవేక్షణలో చెన్నైకు చెందిన ఫ్రీడం ట్రస్టు నుంచి యాక్స్ హెల్త్‌కేర్ ప్రతినిధులు ఈ కార్యక్రమం చేపట్టారు. ఏడీ కృష్ణకిషోర్ మాట్లాడుతూ రూ. 50వేలు విలువ చేసే కృత్రిమ కాళ్లను ఉచితంగా అందిస్తున్నారని, అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శుక్రవారం కూడా ఈ శిబిరం కొనసాగుతుందని తెలిపారు. ట్రస్టు ప్రతినిధి సుదర్శన్‌రెడ్డి, దర్శనీ మానసిక పాఠశాల నిర్వాహకులు గోవిందరెడ్డి, వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చిన్న సుబ్బయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు లోడు క్రమబద్ధీకరణకు రాయితీతో అవకాశం

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యుత్తు లోడు క్రమబద్ధీకరణకు విద్యుత్తు సంస్థ అవకాశం కల్పించిందని కడప డివిజన్ ఈఈ హరిసేవ్యానాయక్ పేర్కొన్నారు. తన కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఒక కిలో వాట్ విద్యుత్తు సర్వీసుకు ఇది వరకు రూ.2 వేలు ఉండేదని, ఇప్పుడు 50 శాతం రాయితీతో రూ.1000తోనే క్రమబద్ధీకరించుకోవచ్చని అన్నారు. ఈ అవకాశం జూన్‌లో ముగుస్తుందని, తర్వాత రాయితీ వర్తించదని చెప్పారు. డీఈలు రామచంద్రారెడ్డి, సుబ్రమణ్యం, నాగశేషారెడ్డి, జేఈ టెక్నికల్ జయకేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

18,302 మంది విద్యార్థుల హాజరు

కడప విద్య, న్యూస్‌టుడే : జిల్లావ్యాప్తంగా గురువారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు గణితం 1ఏ, బాటనీ, సివిక్స్ పరీక్షలు జరిగాయి. జనరల్ విభాగంలో 16,906 మంది, ఒకేషనల్ విభాగంలో 1,396 మంది మొత్తం 18,302 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులకు అసౌకర్యంగా లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆర్ఐవో వెంకటసుబ్బయ్య పరిశీలించారు.

వైవీయూలో ప్రాంగణ ఎంపికలకు స్పందన

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: యోగి వేమన విశ్వవిద్యాలయం ఒక విజ్ఞానగని అని, ఇక్కడ లభించే వనరులను సద్వినియోగం చేసుకుని ఉద్యోగఅవకాశాలను పొందాలని ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి పేర్కొన్నారు. వర్సిటీలో గురువారం ప్లేస్‌మెంట్ డైరెక్టర్ విజయభారతి ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈసందర్భంగా హైదరాబాద్ దివిస్ లేబరేటరీ సంస్థలో యూనియన్ ప్లేస్‌మెంట్ సెల్‌తో పరస్పర ప్రయోజనాల కోసం వర్సిటీ అధికారులు ఒప్పందం చేసుకున్నారు. ఈసందర్భంగా దివీస్ లేబరేటరీ, శ్రీచైతన్య స్కూల్ ప్రతినిధులు అభ్యర్థులకు రాతపరీక్ష, ఇంటర్వ్యూ, డెమోలతో పరీక్షలు నిర్వహించి ప్రతిభ చూపిన వారిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. రిజిస్ట్రార్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఉద్యాన పథకాలు

కిట్లు అందజేస్తున్న ఉద్యానశాఖ జిల్లా అధికారి సుభాషిణి

కడప వ్యవసాయం, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా అమలు చేసే ప్రతి పథకం, కార్యక్రమం అర్హులైన రైతులందరికీ అందేలా చూడాలని ఆ శాఖ జిల్లా బాధ్య అధికారి సుభాషిణి పేర్కొన్నారు. గురువారం జిల్లా సచివాలయ ఆవరణంలో రైతు సేవాకేంద్ర (ఉద్యానశాఖ విభాగం) సహాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పథకాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా మట్టి నమూనా కిట్లను అందజేశారు. ఏపీ ఎంఐపీ పీడీ వెంకటేశ్వరరెడ్డి బిందు, తుంపర సేద్య పరికరాలు కావాల్సిన రైతులు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. మామిడిపూతలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కేవీకే శాస్త్రవేత్త మానస వివరించారు. ఉద్యాన అధికారులు జ్యోతిర్మయి, జయభరత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆశయ సాధనలో కలిసికట్టుగా పనిచేయాలి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ఆకాంక్ష జిల్లాల ఆశయసాధనలో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో అగ్రగామిగా నిలిపేందుకు కలిసికట్టుగా పనిచేయాలని కలెక్టర్ శ్రీధర్ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం కార్యాచరణపై కేంద్ర ప్రభుత్వ డిప్యూటీ డైరెక్టర్‌జనరల్ సచిన్‌మిట్టల్, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష చేపట్టారు. కలెక్టర్ మాట్లాడుతూ హెల్త్ అండ్ న్యూట్రిషన్, ఎడ్యుకేషన్, నైపుణ్యాభివృద్ధి, గృహనిర్మాణం, వ్యవసాయం, పశుపోషణ తదితర అంశాల్లో నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసేలా చూడాలన్నారు. పోస్టల్ శాఖకు సంబంధించి ఆర్థిక లావాదేవీల సేవలను మెరుగ్గా ప్రజలకు అందిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సీపీవో హజరత్తయ్య, పరిశ్రమల శాఖ జీఎం చాంద్‌బాషా, డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు ఆనంద్‌నాయక్, కిరణ్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, ఉద్యానశాఖ డీడీ సుభాషిణి, పశుసంవర్ధక శాఖ జేడీ శారదమ్మ, ఎల్డీఎం జనార్దనం తదితరులు పాల్గొన్నారు.

పొదుపు మహిళలకు విస్తృత సేవలు

కడప గ్రామీణ, చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాల మహిళలకు తపాలా శాఖ ఆధ్వర్యంలో విస్తృతంగా సేవలు అందిస్తున్నామని పోస్టల్ డిపార్టుమెంట్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ జనరల్ (న్యూదిల్లీ) సచిన్ మిట్టల్ పేర్కొన్నారు. జిల్లాకు వచ్చిన ఆయన గురువారం హౌసింగ్ బోర్డు కాలనీలోని మెప్మా కార్యాలయంలో, చింతకొమ్మదిన్నెలో స్వయం సహాయక సంఘాల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తపాలా శాఖ ద్వారా ప్రభుత్వం అమలు చేసే పథకాలు, కార్యక్రమాలను వివరించారు. మెప్మా పీడీ కిరణ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్, మెప్మా, డీఆర్‌డీఏ సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

జగదభిరాముడికి కిరీటం బహూకరణ

అర్చకుడు శ్రావణ్‌కుమార్‌కు కిరీటాన్ని అందజేస్తున్న దాత విజయశేఖర్

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట కోదండ రామాలయంలో జగదభిరాముడికి హైదరాబాద్‌లోని నార్సింగ్ నివాసి తూములూరి విజయశేఖర్ కిరీటాన్ని గురువారం బహూకరించారు. తమిళనాడు రాష్ట్రం కుంభకోణంలో రత్నాలతో ప్రత్యేకంగా మకుటాన్ని రూ.2.20 లక్షలతో తయారు చేయించారు. అర్చకులు శ్రావణ్‌కుమార్, పవన్‌కుమార్‌కు కిరీటాన్ని అందజేశారు.



స్వయం సహాయక సంఘాలకు చెక్కు అందజేస్తున్న కలెక్టరు శ్రీధర్, అధికారులు

యువత పరిశ్రమలు స్థాపించాలి

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : యువత పారిశ్రామిక రంగం వైపు రావాలని జిల్లా కలెక్టరు చెరుకూరి శ్రీధర్ అన్నారు. కడప నగరంలోని మహాలక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో గురువారం యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో మెగా ఎంఎస్ఎంఈ ఔట్ రీచ్ క్యాంపును కలెక్టరు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ)ల సాధికారతతోనే దేశ సామాజిక, ఆర్థిక పరిపుష్టి సాధ్యమవుతుందన్నారు. ఎంఎస్ఎంఈ జీఎం సుధాకర్ మాట్లాడుతూ లబ్ధిదారులకు సెక్యూరిటీ లేకుండా రూ.5 కోట్ల వరకు రుణాలను అందించేందుకు యూనియన్ బ్యాంకు సిద్ధంగా ఉందన్నారు. బ్యాంకు కడప రీజనల్ మేనేజరు లక్ష్మీతులసి మాట్లాడుతూ జిల్లాలో 551 మందికి రూ.150 కోట్లకు పైగా నారీశక్తి పథకం ద్వారా రుణాలను అందించామని, కడప రీజియన్ పరిధిలో ఇప్పటి వరకు రూ.600 కోట్ల ఎంఎస్ఎంఈ రుణాలు మంజూరు చేశామని వివరించారు. అనంతరం ఎస్ హెచ్‌సీ గ్రూపులకు రుణాలకు సంబంధించి మెగా చెక్కులను అందించారు. చేనేత సంఘాలకు, బీసీ కార్పొరేషన్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ, మెప్మా, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్లు ఆనంద్‌నాయక్, కిరణ్‌కుమార్, శ్రీలక్ష్మి, హ్యాండ్ లూమ్స్ ఏడీ పిచ్చేశ్వరరావు, బీసీ కార్పొరేషన్ ఈడీ జయసింహ, యూనియన్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

KVB Karur Vysya Bank Smart way to bank

ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్
జూబ్లీహిల్స్ శాఖ, ప్లాట్ నం.265జె, కీర్తి మాన్షన్, రోడ్ నం.10, జూబ్లీహిల్స్, హైదరాబాద్, తెలంగాణ-500033.
ఫోన్: 040-23546163, సెల్: 9959988563

స్థిరాస్తి విక్రయం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటెర్స్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9(1)కు నిబంధనతో చదువగల సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్ 2002 క్రింద స్థిరాస్తి అమ్మకం ఇ-వేలం అమ్మకపు ప్రకటన.

ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకంగా ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(ల)కు నోటీసు ఇవ్వడమేమనగా దిగువ వివరించిన స్థిరాస్తి సెక్యూర్డ్ క్రెడిటార్, ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్ వారికి తాకట్టు మరియు చార్జ్ చేయబడినది మరియు ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్, జూబ్లీహిల్స్ శాఖ-హైదరాబాద్ యొక్క అధీకృత అధికారిచే స్వాధీనంలోకి తీసుకున్నారు. ఋణగ్రహీత: మెస్సర్స్ క్రిస్టల్ విజన్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, దీనికి ప్రాతినిధ్యం వహిస్తున్న డైరెక్టర్లు: 1. శ్రీ అవ్వ సీతారామారావు, 2